ట్రంక్ లైన్ మ్యాన్‌హోల్ నిర్మాణం పూర్తయినా
గుంతలు పూడ్చరా..

● హయత్‌నగర్‌లో మూడు నెలలుగా ట్రాఫిక్ సమస్య
● పట్టించుకోని అధికారులు, కాంట్రాక్టర్



హయత్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల క్రితం హయత్‌నగర్‌లో కురిసిన భారీ వర్షాలకు విజయవాడ జాతీయ రహదారిపైన హైవే బవార్చీ ఎదురుగా, రాఘవేంద్ర టిఫిన్ సెంటర్ పక్కన ట్రంక్ లైన్ మ్యాన్‌హోల్ కుంగిపోయింది. దీంతో అక్కడ భారీ అగాదం ఏర్పడింది. వెంటనే అప్రమత్తమైన జలమండలి అధికారులు అక్కడ ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. అగాదానికి దగ్గరగా ప్రజలు, వాహనాలు, రాకుండా దాదాపు పది మీటర్ల దూరం నుంచి సిమెంటు దిమ్మెలు ఏర్పాటు చేశారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారింది. అక్కడే జాతీయ రహదారిపైన యూటర్న్ ఉండడంతో రోజూ ట్రాఫిక్ జాం ఏర్పడుతోంది. దీంతో ఉదయం, సాయంత్రం నరకం కనిపిస్తోంది. దీంతో అక్కడ ఒక పోలీసును ఏర్పాటు చేసి ట్రాఫిక్ జాం కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో ఏర్పడిన గుంత కారణంగా నేతాజీ కాలనీ, హయత్‌నగర్ ఓల్డ్ విలేజీ, అన్మగల్ హయత్‌నగర్ ప్రాంతాలకు రాకపోకలను నిలిపివేశారు. దీంతో వాహనదారులు రాంగ్ రూట్‌లో ప్రయాణించి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల వర్షాలు తగ్గుముఖం పట్టడంతో 15 రోజుల క్రితం జలమండలి అధికారులు ట్రంక్ లైన్‌కు కొత్త మ్యాన్‌హోల్‌ను నిర్మించారు. అంతవరకు బాగానే ఉంది. మ్యాన్‌హోల్ నిర్మాణం పూర్తై 15 రోజులు అయినా అక్కడి గుంతలను పూడ్చకుండా అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో మూడు నెలలుగా స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతునే ఉన్నారు. అక్కడ ఏర్పడిన గుంతల్లో సుమారు రెండు లారీల మట్టి, డస్టు నింపితే సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంది. కానీ, అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



కుంగిన ట్రంక్ లైన్ మ్యాన్‌హోల్ కారణంగా హయత్‌నగర్‌లో జాతీయ రహదారిపైన సగం వరకు ఏర్పాటు చేసిన సిమెంటు దిమ్మెలు

ప్రాణాలు పోయే వరకు పట్టించుకోరా?



ట్రంక్ లైన్ మ్యాన్‌హోల్ పనులు పూర్తయిన చోట మట్టిని నింపేందుకు అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. ప్రజల ప్రాణాలు పోయే వరకు స్పందించరా.. జాతీయ రహదారిపైన రోజూ ట్రాఫిక్ జాం అవుతోంది. హయత్‌నగర్ ఓల్డ్ విలేజీకి రాకపోకలు నిలిపేశారు. అధికారులు నిర్లక్ష్యం వీడి గుంతలను పూడ్చి వేయాలి. లేని పక్షంలో జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తాం.

\- సామ తిరుమల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్, హయత్‌నగర్

గుంత పూడ్చమని కాంట్రాక్టర్‌కు ఆదేశాలిచ్చాం

హయత్‌నగర్ హైవే బవార్చీ ఎదురుగా జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపైన కుంగిన ట్రంక్ లైన్‌కు 15 రోజుల క్రితం మ్యాన్‌హోల్ నిర్మించాం. గుంతను మట్టి, డస్టుతో పూడ్చమని కాంట్రాక్టర్‌కు ఆదేశాలు ఇచ్చాం.

-రాజు, సెక్షన్ మేనేజర్, డివిజన్-11, ఆటోనగర్



సమావేశంలో పాల్గొన్న బీజేపీ అబ్దుల్లాపూర్‌మెట్ ముఖ్యనాయకులు

బీజేపీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకోవాలి

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని మెజార్టీ గ్రామాల్లో బీజేపీ బలపర్చిన సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బబ్బూరి సాయిగౌడ్ పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బీజేపీ కార్యాలయంలో సాయిగౌడ్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. మండలంలోని 14 గ్రామాలకు చెందిన ఆ పార్టీ ముఖ్య నాయకులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయిగౌడ్, సీనియర్ నాయకుడు వడ్డేపల్లి పాపయ్యగౌడ్ మాట్లాడుతూ మండలంలోని 14 గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు పోటీ చేస్తారని తెలిపారు. ఈ విషయమై ఈ నెల 29న మండల కేంద్రంలోని శివ గార్డెన్‌లో సాయంత్రం పార్టీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న అభ్యర్థులు, అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంగ జంగమయ్య గౌడ్, బండిగారి విష్ణుగౌడ్, కందాళ బల్‌దేవ్‌రెడ్డి, బుర్ర వీరస్వామీగౌడ్, బొడిగె రమాదేవి, రామకృష్ణ, మేడిపల్లి వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జయంత్‌రావు

స్థానిక ఎన్నికల్లో కుమ్మరి కులస్థులు పోటీ చేయాలి

సంతోష్‌నగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా అవకాశం ఉన్న ప్రతి స్థానంలో కుమ్మరి కులస్థులు సర్పంచ్, వార్డు మెంబర్లుగా పోటీ చేయాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడ జయంత్‌రావు పిలుపునిచ్చాడు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లో గురువారం కుమ్మరి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా జయంత్‌రావు హాజరై మాట్లాడారు. బీసీ స్థానాలతో పాటు జనరల్ స్థానాల్లో కుమ్మరి కులస్థులు పోటీలో ఉండాలని, ఐక్యంగా ఉండి గెలిపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కుమ్మర సంఘం రాష్ట్ర కోశాధికారి ఆమంచి రాజలింగం, రాష్ట్ర కార్యదర్శి జిల్లెల శంకర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎగిరి శెట్టి వీరయ్య, నాయకులు యాదయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ట్రంక్ లైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవ జీవన్‌రెడ్డి

అధికారుల నిర్లక్ష్యంతో ట్రంక్ లైన్ పనుల్లో ఆలస్యం

హయత్‌నగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అధికారులు నిర్లక్ష్యం కారణంగానే హయత్‌నగర్ డివిజన్‌లోని పద్మావతి కాలనీలో ట్రంక్ లైన్ నిర్మాణ పనుల్లో తీవ్ర ఆలస్యం జరుగుతోందని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన పద్మావతి కాలనీలో జరుగుతున్న ట్రంక్ లైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ అధికారుల చుట్టు తిరిగినా పనులు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు నెలలుగా పద్మావతి కాలనీలో పనులు జరుగుతున్నా ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయని అన్నారు. రోడ్డు మూసుకుపోవడంతో ప్రజలు, వాహనం దారులు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు వేగంగా చేయాలని ఆయన కోరారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కాక్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి

హయత్‌నగర్‌లో కార్పొరేటర్ కొప్పుల పర్యటన

హయత్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని వినాయకనగర్ కాలనీ, ప్రగతీనగర్ కాలనీలలో మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి గురువారం పర్యటించారు. ధోబీఘాట్‌లను పరిశీలించారు. ధోబీఘాట్ వద్ద వీధి లైట్లు ఏర్పాటు చేయించినందుకు పలువురు రజకులు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకుల సమస్యను పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రగతీనగర్ కాలనీలోని సమస్యలన్నింటినీ త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వెంకటేశ్వకాలనీలో నెలకొన్న సమస్యను త్వరలో పరిష్కరిస్తామని అన్నారు. పాడైన రోడ్ల స్థానంలో కొత్త రోడ్లు వేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీఎం హామీ నిలబెట్టుకోవాలి : ఏబీవీపీ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఏబీవీపీ ఓయూ అధ్యక్ష, కార్యదర్శులు దృహన్, శివశంకర్ కోరారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓయూను ఇతర విశ్వవిద్యాలయాలతో పోటీ పడే స్థాయికి తీసుకెళ్లాలన్నారు. పరిశోధన అభివృద్ధికి ఫ్యాకల్టీ నియామకాలు, అధునాతన ల్యాబ్ పరికరాలు, ఓయూ-హాబ్ ఏర్పాటు అవసరమని సూచించారు. ముఖ్యమంత్రి హామీ నిలబెట్టుకోకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.



పంచముఖ ఆంజనేయ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కొప్పుల విఠల్‌రెడ్డి, కాలనీ సభ్యులు, మహిళలు

హనుమాన్ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

మన్సూరాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ శ్రీరామహిల్స్‌కాలనీలోని కమ్యూనిటీ హాలు పక్కన పంచముఖ హనుమాన్ ఆలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి, ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

రుణాలను పొందలేని వారికి ఎలక్ట్రిక్ ఆటోలు పంపిణీ

● మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల

చాదర్‌ఘాట్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బ్యాంక్‌లు, ఇతర కార్పొరేషన్ల ద్వారా రుణాలను పొందలేని వారికి స్వయం ఉపాధి పథకంలో భాగంగా ఎలక్ట్రిక్ ఆటోలను పంపిణీ చేస్తున్నామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. గురువారం చావునీ డివిజన్‌లోని చంచల్‌గూడలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో 16 మంది లబ్ధిదారులకు ఎలక్ట్రిక్ ఆటోలను ఎమ్మెల్యే బలాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎలక్ట్రిక్ ఆటోల వల్ల ఇంధనం, ఇతర నిర్వాహణ ఖర్చులు పూర్తిగా తగ్గడంతో నెలవారీ వాయిదాలు చెల్లించుకునే వెసులుబాటు కలుగుతుందని తెలిపారు. ముందస్తుగా చెల్లించాల్సిన రూ.26వేలను ఎంఐఎం పార్టీ ద్వారా చెల్లించి లబ్ధిదారునికి ఆటో అందజేసి స్వయం ఉపాధి కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ సలామ్ షాహిద్, ఎంఐఎం నాయకులు సైపుద్దీన్ షఫీ, షేక్ మోహీయుద్దీన్ అబ్రార్, సయ్యద్ అలీం, అనాస్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.



ఎలక్ట్రిక్ ఆటోలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలాల, పక్కన కార్పొరేటర్ సలాం షాహిద్ తదితరులు

50 మంది మహిళలకు గ్యాస్ సిలిండర్లు పంపిణీ

చావునీ డివిజన్‌లోని షా కాలనీలో జరిగిన కార్యక్రమంలో నిరుపేద కుటుంబాలకు చెందిన 50 మంది మహిళలకు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి.. ప్రమాదాలు నివారించండి

● 10 ప్రాంతాల్లో 300 మందికి అవగాహన
● ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి



తుక్కుగూడలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న టీటీఐ అధికారులు

కొత్తపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు నివారించాలని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి సూచించారు. ట్రాఫిక్ నిబంధనలపై రాచకొండ పరిధిలోని 10 ప్రాంతాల్లో 300 మందికి గురువారం అవగాహన కల్పించామని ఆయన తెలిపారు. ఆర్‌ఎస్‌ఐ సంతోష్‌కుమార్, ఎస్‌ఐ నర్సింహరావు, ఏఎస్‌ఐ సోమ్‌నాథ్, సిబ్బంది రమేష్ బృందం పహాడీషరీఫ్, ఎయిర్‌పోర్టు రోడ్డు, తుక్కుగూడ, మహేశ్వరం తుక్కుగూడ క్రాస్‌రోడ్స్, ఓఆర్‌ఆర్ ట్రామా సెంటర్ రావిర్యాల, బొంగ్లూరు ప్రాంతాల్లో అవగాహన సెషన్లు నిర్వహించారు. అనంతరం వాహనదారులకు, క్యాబ్ డ్రైవర్లకూ రోడ్ సేఫ్టీ రూల్స్ ఉన్న కరపత్రాలు పంపిణీ చేశారు.

53 మంది మందుబాబులకు కౌన్సెలింగ్

ఎస్పీఓలు అమరవర్ధన్‌రెడ్డి, అల్లూరయ్య టీటీఐలో 53 మంది మందుబాబులకు వారి కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి, ఎస్పీఓలు అమరవర్ధన్‌రెడ్డి ట్రాఫిక్ శిక్షణ పార్కు లెక్చర్ హాల్‌లో వివిధ ప్రాంతాల ట్రాఫిక్ అధికారులకు వాహనాల రాకపోకల నియంత్రణ, వర్టికల్ అంశాల ప్రాధాన్యతలపై పాఠాలు చెప్పారు.



ఓయూ వీసీని కలిసిన బీదర్ యూనివర్సిటీ బృందం

ఓయూను సందర్శించిన బీదర్ యూనివర్సిటీ బృందం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో అమలవుతున్న ఆన్‌లైన్ ఇవాల్యుయేషన్ వ్యవస్థ పనితీరును అధ్యయనం చేయడానికి కర్ణాటకలోని బీదర్ యూనివర్సిటీ ప్రతినిధి బృందం గురువారం ఓయూను సందర్శించింది. డిజిటల్ మూల్యాంకన విధానం వేగం, కచ్చితత్వం, భద్రత వంటి ప్రత్యేకతలను ఓయూ వీసీ కుమార్ మొలుగరం వారికి వివరించారు. బీదర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ బిరాదర్ ఆధునిక, తప్పులేని ఇవాల్యుయేషన్ వ్యవస్థను తమ విశ్వవిద్యాలయంలో అమలు చేసేందుకు ఓయూ సహకారాన్ని కోరారు.



రిజిస్ట్రార్ నరేశ్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రొఫెసర్లు

ఓయూలో జాతీయ వర్క్‌షాప్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో "డ్రైవింగ్ జెన్ జెడ్ టువార్డ్స్ లైఫ్ గోల్స్" పేరిట రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్ గురువారం ప్రారంభమైంది. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.నరేశ్‌రెడ్డి వర్క్‌షాప్‌ను ప్రారంభించి మాట్లాడారు. యువతలో జీవన నైపుణ్యాలు, నైతిక విలువలు, భవిష్యత్ సామర్థ్యాలు రూపుదిద్దడంలో విశ్వవిద్యాలయాల పాత్ర కీలకమని అన్నారు. డిజిటల్ యుగంలో జెన్ జడ్ తరగతులను కొత్త రీతిలో రూపొందిస్తున్నారని, గేమిఫికేషన్, బ్లెండెడ్ లెర్నింగ్, మెంటర్‌షిప్ వంటి పద్ధతులు అవసరమని మెనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ శ్రీరాములు సూచించారు. ప్రొఫెసర్ ఇంద్రకాంతి శేఖర్ యాక్టివిటీ-బేస్డ్ లెర్నింగ్ ప్రాముఖ్యతను వివరించారు. నూతన తరం విద్యార్థుల అంచనాలకు తగ్గట్టుగా విద్యా సంస్థలు మారాల్సిన అవసరం ఉందని కన్వీనర్ డా. సమున్నత చెప్పారు. రెండు రోజులపాటు నిపుణుల ప్రసంగాలు, ఇంటరాక్టివ్ సెషన్లు, కేస్ స్టడీలు, బోధనా పద్ధతుల ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు విభాగాధిపతి ప్రొఫెసర్ జహంగీర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు వెంకటయ్య, స్మితా సాంబ్రాని, చెన్నప్ప, ప్యాట్రిక్, కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి సంచరిస్తున్న వ్యక్తికి మూడు రోజుల జైలు

చాదర్‌ఘాట్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా బుధవారం అర్ధరాత్రి వేళ సంచరిస్తున్న వ్యక్తిని చాదర్‌ఘాట్ పోలీసులు అరెస్టు చేశారు. చాదర్‌ఘాట్ ఎస్‌ఐ భరత్ తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేట నివాసి మహ్మద్ (40) బుధవారం అర్ధరాత్రి 2.30గంటల ప్రాంతంలో ఓల్డ్‌మలక్‌పేటలోని వాహేద్‌నగర్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న చాదర్‌ఘాట్ పోలీసులు అతన్ని ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వకపోగా వాగ్వాదానికి దిగాడు. దొంగతనానికి పాల్పడేందుకు యత్నిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ ఎం.మురళి నిందితునికి 3రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు చాదర్‌ఘాట్ ఎస్‌ఐ భరత్ తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయం

● తండ్రి, కుమారుడి అరెస్ట్

చాదర్‌ఘాట్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న తండ్రి కుమారున్ని చాదర్‌ఘాట్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ కేబీ మురారీ తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్‌మలక్‌పేట శంకర్‌నగర్ నివాసులైన ఎం.సోనుకుమార్, వినయ్ తండ్రి కొడుకులు. వీరు మద్యం అక్రమంగా విక్రయిస్తున్నట్లుగా అందిన సమాచారం మేరకు చాదర్‌ఘాట్ పోలీసులు దాడులు జరిపారు. 29 మద్యం సీసాలను గుర్తించారు. వీటిని అక్రమంగా విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైందన్నారు. సోనుకుమార్, వినయ్‌లను చాదర్‌ఘాట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కేసును చాదర్‌ఘాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మన్సూరాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నాగోల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్ లలితానగర్‌లో కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటున్న బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి(39) ప్రైవేట్ ఉద్యోగి. బుధవారం రాత్రి విధులు ముగించుకుని కొత్తపేటలోని తన ఆఫీస్ నుంచి ఇంటికి ద్విచక్ర వాహనం (టీఎస్25 ఏ 1846)పై వస్తుండగా రాత్రి 9 గంటల సమయంలో నాగోల్‌లోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద ముందున్న మరో బైకును తప్పించబోయి అదుపుతప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రాజశేఖర్‌రెడ్డిని ఘటనా స్థలం వద్ద ఉన్న పలువురు సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రాజశేఖర్ రెడ్డి మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య బైరెడ్డి మధుమ ఫిర్యాదు మేరకు నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సభలు, సమావేశాలకు అనుమతి తప్పనిసరి

● రాచకొండ సీపీ సుధీర్ బాబు

హైదరాబాద్ సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికల నగరా మోగిన సందర్భంగా అనుమతి లేని సభలు, సమావేశాలపై ఆంక్షలు విధిస్తూ గురువారం రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. పోలీసుల అనుమతి లేకుండా ఎవరూ సభలు, సమావేశాలు నిర్వహించరాదని, దీనిని ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆంక్షలు ఎన్నికలు ముగిసేవరకు అమలులో ఉంటాయని సీపీ పేర్కొన్నారు.

'తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికలకు సిద్ధమవ్వండి'

రంగారెడ్డి జిల్లా కోర్టులు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలు వచ్చే ఏడాది మొదిటి మాసంలో ఉంటాయని, ఈ ఎన్నికలకు న్యాయవాదులు సిద్ధమవ్వాలని తెలంగాణ బార్ కౌన్సిల్ ఛైర్మన్ నర్సింహారెడ్డి, సభ్యులు అనంతసేనారెడ్డి, భార్గవ్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి విడుదల చేసిన ఒక ప్రకటనను గురువారం జిల్లా బార్ అసోసియేషన్ కార్యదర్శి బాసెట్టి కార్తీక్ విడుదల చేశారు. నాలుగేళ్ల పాటు కొనసాగే బార్ కౌన్సిల్ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్‌ను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. కౌన్సిల్ సభ్యత్వం ఉన్న ప్రతీ న్యాయవాదికి ఈ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉంటుందని వారు తెలిపారు.



ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులతో సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ లక్ష్మీమాధవి

ఎన్ని ఆటంకాలు ఎదురైనా లక్ష్యాన్ని సాధించాలి

మన్సూరాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలని రాచకొండ సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ గుల్లపల్లి లక్ష్మీమాధవి సూచించారు. మన్సూరాబాద్ డివిజన్ సెంట్రల్ బ్యాంక్‌కాలనీలోని కాకతీయ పాఠశాలలో నిర్వహించిన ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులకు వారి వారి హోదాలను గురువారం ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇన్‌స్పెక్టర్ లక్ష్మీమాధవి పాఠశాల జోనల్ ప్రధానోపాధ్యాయుడు రమేష్ చంద్ర, డైరెక్టర్ వెంకట్‌తో కలిసి గెలుపొందిన విద్యార్థులను శాలువాలతో సన్మానించి అభినందించారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ లక్ష్మీమాఈవిని సన్మానించిన పాఠశాల యాజమాన్యం సామాజిక వైద్యురాలు బిరుదును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలోపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పరిమళ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు అందజేస్తున్న టీఎండీఏ ప్రతినిధులు

కండరాల క్షీణత బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

సైదాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మస్కులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్(టీఎండీఏ) ఆధ్వర్యంలో గురువారం సైదాబాద్ వినయ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో షేర్ ది విజన్ ఖమ్మం వారు 200 మంది కండరాల క్షీణత బాధితులకు నిత్యావసరాలు ఉచితంగా అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన విద్యావేత్త వీరేందర్ బాబు మాట్లాడుతూ కండరాల క్షీణిత బాధితులకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా దాతలు, షేర్ ది విజన్ ప్రెసిడెంట్ నారాయణ రావు, కోశాధికారి సద్గుణరావులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎండీఏ వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, కోశాధికారి వినోద్ కుమార్, సంయుక్త కార్యదర్శులు సతీష్‌చంద్ర, శివకుమార్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.



లెప్రసీ బాధితులకు బెడ్‌లను పంపిణీ చేస్తున్న మార్వాడీలు

లెప్రసీ బాధిత కుటుంబాలకు పరుపులు అందజేత

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పసుమాముల పరిధి సంతోష్‌నగర్ కాలనీలో లెప్రసీ బాధిత కుటుంబాలకు బేగంపేటకు చెందిన మాధవి(మార్వాడీలు) గురువారం పరుపులను అందజేశారు. స్లాప్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మనియాద రమేష్ సమక్షంలో 30 లెప్రసీ కుటుంబాలకు నాణ్యమైనా పరుపులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమవంతు సహాయంగా లెప్రసీ బాధితులను ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.